క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

మక్తల్: సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని బురాన్‌గడ్డలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం దిమ్మెలు నిర్మించారు. అయితే దిమ్మెలు నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంపై రెండు రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై శనివారం అధికారులు స్పందించి బురాన్‌గడ్డలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. దీంతో కాలనీల్లో విద్యుత్ సమస్య తీరనుంది.

యూరియాపై వదంతులు నమ్మొద్దు



మరికల్: రైతులకు గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా యూరియా పంపిణీ చేశామని ఈ విషయంపై ఎలాంటి వదంతులు నమ్మొద్దని ఏఓ రహ్మాన్ అన్నారు. శనివారం మరికల్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1309 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కొంతమంది రైతులు తమ అవసరాలకు మించి యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేయడం వల్లే ఇతర రైతులకు ఇబ్బందులు కలుగుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం హాకా కేంద్రానికి కూడా యూరియాను తెప్పించి విక్రయాలు చేపడుతామన్నారు. యూరియా బస్తాల స్థానంలో నానో యూరియా వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు నానో యూరియాపై ఆసక్తి చూపాలని సూచించారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



మరికల్: మండలంలోని జిన్నారం గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం ఎంపీడీఓ కొండన్నతో కలిసి కాంగ్రెస్ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. పనుల జాతరలో భాగంగా గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు అయినట్లు అధికారులు తెలిపారు. పనులు తర్వగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీరన్న, సూర్యమోహన్‌రెడ్డి, మల్లికార్జున్, మహేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హరీష్, వెంకటేష్, ఆంజనేయులు, ప్రవీణ్ అనితలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మక్తల్: పట్టణంలో శ్రీపడమటి ఆంజనేయ స్వామి దేవాలయలలో లయన్స్ క్లబ్ సభ్యుడు శరణప్ప మనుమరాలు శ్రీనిక మొదటి పుట్టిన రోజు సందర్భంగా ఆలయం దగ్గర దాదాపు 350 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీరామ్, అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, కార్యదర్శి అంజన్‌ప్రసాద్, కోశాధికారి అడేం సత్య నారాయణ,అన్నదాత శరణప్ప పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



కృష్ణా: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 25, 26 తేదీలలో నిర్వహించనున్న మొదటి మహాసభలను విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్యరైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండలంలోని ఖాన్‌దొడ్డి గ్రామంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం జిల్లా నాయకులు ఆనంద్ శనివారం విడుదల చేశారు. సభలకు మండలంలోని రైతులు అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యకమ్రంలో ఆ సంఘం నాయకులు లక్ష్మణ్, మహాదేవ్,తాయప్ప,శరణప్ప,బాలు,హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ ఇవేం రోడ్లు



వడ్వాట్ గ్రామ సమీపంలో ప్రమాదకరంగా గుంత



అడవిసత్యావార్ దగ్గర రోడ్డు ఇలా..

మాగనూర్: మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని వడ్వాట్ నుంచి మందిపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గం మొత్తం ప్రమాదకర గుంతలు ఏర్పడడంతో పాటు అధ్వానంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజల, విద్యార్థుల ప్రయాణ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో చివరికి ఆర్టీసీ అధికారులు ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా రద్దు చేసిన దుస్థితి ఏర్పడింది. గుంతల రోడ్లను బాగు చేయాలని ఏళ్ల నుంచి మొరపెట్టుకుంటున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ఈ మార్గంలోని రోడ్డుకు మరమ్మతు చేపట్టి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



కొల్పూర్-అడవిసత్యావార్ మధ్య అధ్వానంగా తయారైన రహదారి



అడవిసత్యావార్ లోలెవల్ వంతెనపై కుంగిన రోడ్డు

ఎట్టకేలకు తాత్కాలిక వంతెన నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

కొత్తపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండల పరిధిలో వంతెన కొట్టుకుపోయింది. ఈ క్రమంలో సాక్షి దినపత్రికలో దీనిపై వరుస కథనాలు ప్రచురించగా శనివారం అధికారులు స్పందించారు. వాగులో వరద తగ్గుముఖం పట్టడంతో బ్రిడ్జి నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ తిరిగి తాత్కాలిక వంతెన నిర్మించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి కావడంతో మండల కేంద్రంతో పాటు నారాయణపేట జిల్లా కేంద్రానికి రాకపోకలు పునః ప్రారంభం అయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తపల్లి-భూనీడు మధ్య ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన

ఘనంగా జల్దిబిందె మహోత్సవం



కొత్తపల్లిలో జల్దిబిందెతో వస్తున్న భక్తులు



మాగనూర్‌లో..

మాగనూర్/దామరగిద్ద: మండల పరిధిలోని కొత్తపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి వారి జల్దిబిందె మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వాహించారు. శ్రావణమాస చివరి శనివారం గ్రామం నుంచి స్వామి వారి పల్లకీని కృష్ణా నదికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని చూసేందుకు మండలంలోని వివిధ గ్రామల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

లక్షా బిల్వార్చన కార్యక్రమం

మక్తల్/మరికల్: శ్రావణమాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. లక్ష బిల్లార్చన కార్యక్రమంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. వీరభద్రదేవాలయం, శ్రీపడటమటి ఆంజనేయ స్వామి దేవాలయాల్లోనూ పూజలు జరిపించారు.

స్వామివారి పల్లకీ సేవా

కొత్తపల్లి: మండల పరిధిలోని దేవరగట్టుపై వెలసిన తిరుమల స్వామి గుట్టపై జల్దిబిందె ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్ల ప్రతిమలను పల్లకీలో ఊరేగిస్తూ గుట్టపైకి చేరుకొని ఉత్సవాలను జరుపుకున్నారు.

ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు

మద్దూరు/కోస్గి: శ్రావణమాస ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా మద్దూరులో నెల రోజుల పాటు సాగిన హరేరామ, హరే కృష్ణ మేల్కొపు భజన నేటితో ముగించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కృష్ణా: మండల కేంద్రంలో శనివారం అమావాస్యతో పాటు శ్రావణమాసం ముగింపు సందర్భంగా అఖిల భారత అయ్యప్ప ప్రచార సమితి ఆధ్వర్యంలో గ్రామంలోని పేదలకు అన్నదానం చేశారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం

నారాయణపేట రూరల్: రఘుప్రేమ తీర్థల ఆరాధన ఉత్సవాలు మండలంలోని కోటకొండ నరసాచలం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనం జరుగుతుంది. మొదటి రోజు పంచామృత అభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

⇨ కాళబెళగుండె బసదేశ్వర స్వామి దేవాలయంలో శనివారం అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, శాస్విత రుద్రాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు.

ధన్వాడ: అమావాస్య సందర్భంగా మండల కేంద్రంలోని వీరభద్రస్వామి, బురుజుగడ్డ ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, శ్రీ వేద సరస్వతి జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు సంస్థ డీఆర్‌పీ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒకవేళ హెచ్‌ఐవీ సోకితే మనం ఏం చేయాలి, హెచ్‌ఐవీ సోకిన వారి పట్ల ఎలా మెలగాలి అనే విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. అలాగే హెచ్‌ఐవీ-ఎయిడ్స్ నివారణ చట్టం-2017 గురించి అదే విధంగా ఎయిడ్స్‌కు సంబంధించిన టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణ, సీఎల్‌డబ్ల్యూ అశోక్, నరసింహులు పాల్గొన్నారు.



శ్రీ వేద సరస్వతి కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

వంతెన నిర్మాణం చేపట్టండి

నారాయణపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా కేంద్రానికి సమీపంలోని నక్క రామయ్య కాలనీ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిందని, భారీ వర్షాల కారణంగా ఇద్దరు పిల్లలు కొట్టుకుపోయి చెట్టును పట్టుకొని ఆగిపోయారని కాలనీవాసులు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఈ క్రమంలో ఆయన శనివారం వాగును సందర్శించి పరిశీలించారు. ఈ ప్రాంతంలో వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. వాగును సందర్శించిన వారిలో ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, నల్ల వెంకటేష్, వై.సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, జేకే అనిల్, ఎం.సంతోష్, కరాటే అశోక్, కాలనీవాసులు, మహిళలు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

కొత్తపల్లి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణారావ్ సూచించారు. మండల పరిధిలోని మన్నాపూర్ గ్రామంలో 13 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 10 మంది లెంటల్ లెవల్ వరకు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. మిగితా లబ్ధిదారులు కూడా నిర్మాణం చేపడితే, ప్రభుత్వం విడతల వారిగా నగదు జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని అమ్లికుంట్ల గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన పురాతన వీరభద్రేశ్వరుడి ఆలయంలో శ్రావణ మాసం ముగింపు సందర్భంగా నంద దీప కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలి

కోస్గి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యంగా విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి శంకర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న నారాయణపేట్ జిల్లా గ్రౌండ్ స్కూల్‌లో తెలంగాణ సమగ్ర శిక్షణ, అలిమ్‌కో (భారత కృత్రిమ ఆవయవాల తయారీ కంపెనీ) వారి ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులను పరిశీలించి ఉచితంగా ఉపకరణలను అందించటానికి సిఫారసు చేస్తారన్నారు. తమ వెంట ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ , రేషన్‌కార్డు , 2 పాస్ ఫోటోలు తీసుకురావాలని కోరారు. వివరాలకు 96527 43069 , 73869 32579 నంబర్లను సంప్రదించాలన్నారు.

చెరువు నీరు విడుదల

ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువు నుంచి తూమ్ ద్వారా తహసీల్దార్ సింధుజా నీటిని విడుదలచేశారు. చెరువు పూర్తి స్థాయిలో నిడి అలుగు పారుతుండటంతో రైతుల విన్నపం మేరకు సాగు కోసం పొలాలకు నీటిని విడుదల చేశారు. నర్సింములు నాయుడు, మాధవరెడ్డి, లక్ష్మయ్యగౌడ్, రాంచంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



మద్దూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నారాయణపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. దాదాపు 250 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5 పుస్తకాల చొప్పున అందజేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరినారాయణ బట్టడ్ తెలిపారు. అనంతరం నోడల్ అధికారి సుదర్శన్‌రావ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తులసి వెంకటేష్ ఉపాన్యాసకులు రాములు, రాజేష్, రమేష్, లక్కిరెడ్డి, సంతునాయక్, అంబర్‌నాథ్, పూర్ణిమ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం ఎంచుకొని చదవాలి



విద్యార్థినిని సన్మానించి నగదు అందజేస్తున్న ఫౌండేషన్ అధినేత ఉమాదేవి

మరికల్: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకొని చదివితే ఎందులోనైన రాణించవచ్చని రాహుల్‌రెడ్డి ఫౌండేషన్ అధినేత ఉమాదేవి అన్నారు. మండలంలోని కన్మనూర్ ఉన్నత పాఠశాల్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కన్మనూర్‌లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించి సీటు సాధించిన స్పందనకు ఫౌండేషన్ తరఫున ప్రోత్సాహకరంగా రూ.5 వేలు అందజేశారు. చదువుకునే వయసులో వ్యసనాలకు బానిస కాకుండా శ్రద్ధగా చదువుకుంటూ భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణకుమార్, బాలనారాయణ పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ అశోక్‌బాబు

మాగనూర్: వినాయక చవితిని మండల ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని మాగనూర్ ఎస్ఐ అశోక్ బాబు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలో మండల ప్రజలతో శాంతి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వినాయ విగ్రహల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను ఆయా కమిటి సభ్యులు పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ పనులు సొంతంగా చేసుకోవద్దని, విద్యుత్ సిబ్బందికి చలానాలు చెల్లిస్తే వారే వచ్చి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వెళ్తారన్నారు. అలాగే ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు డీజేలు నిషేధం

మరికల్: వినాయక చవితి ఉత్సవాలకు డీజేలు నిషేధించినట్లు తహసీల్దార్ రాంకోటి, ఎస్ఐ రాము అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఉత్సవాలను శాంతియుత వాతావారణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఇందుకు గాను ట్రాన్స్‌కో, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారం ఉంటుందన్నారు. నిమజ్జనం వేడుకలకు మాత్రం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డీజేలను నిషేధించడం జరిగిందన్నారు. నింబంధనలను ఉల్లఘించి డీజేలను వాడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, ఆర్ఐ సుధాకార్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇరు వర్గాలతో శాంతి సమావేశం

కొత్తపల్లి/ధన్వాడ: గణేశ్ నవరాత్రులు ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కొత్తపల్లి తహసీల్దార్ జయరాములు అన్నారు. శనివారం గణేశ్ మండప నిర్వాహకులు, హిందూ,ముస్లిం మతపెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. గణేశ్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా ఒకరి పండుగలను ఒకరు గౌరవించుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఇక ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదని ఎవరైనా డీజేలు పెడితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావ్, ఎంపీఓ రామన్న, గణేశ్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



జాజాపూర్ స్కూల్‌లో టీచర్ల నిరసన

నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుల పాలిట గొడ్డలిపెట్టుగా మారిన జీవో 28ను రద్దు చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మండలంలోని జాజాపూర్ జడ్పీ స్కూల్ లో శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు.

● నారాయణపేటలోని పీఆర్టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ దగ్గర నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ స్కూల్‌లో పోస్టర్ విడుదల చేశారు.

నల్లబ్యాడ్జిలతో నిరసన

కోస్గి రూరల్/ఊట్కూరు/మక్తల్/ధన్వాడ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని గుండుమాల్ మండల తపస్ అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. జీవో నంబరు 28 ద్వారా 2014 ఆగస్టు 23న ఉద్యోగుల పాలిట గొడ్డలి పెట్టు లాంటి సీపీఎస్ విధానాన్ని అమలు చేయడాన్ని చీకటి రోజుగా ప్రకటించి శనివారం గుండుమాల్ మండల పరిధిలోని పలు పాఠశాలలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో వంద రోజుల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం గుండుమాల్ తహసీల్దార్ భాస్కర్ స్వామికి వినతిపత్రం అందజేశారు.

పాతపెన్షన్ అమలుచేయాలి

మరికల్: సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని తపస్ మండల శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ రాంకోటికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మాగనూర్: ఎగువన కర్ణాటక రాష్ట్రంలోని నారాయణపూర్ డ్యామ్ నుంచి కృష్ణ నదికి భారీగా వరద నీరు వస్తుందని నది పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మందిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి కురుమూర్తి అన్నారు. మందిపల్లి, కోల్పూర్ గ్రామాల రైతులు, జాలర్లు ఎట్టి పరిస్థితులో నదివైపు వెళ్ల రాదని సూచించారు. బోట్లు నడిపే వారు కూడా బోట్లను వరద ప్రవాహం తగ్గే వరకు చేపల వేటకు వెళ్లొద్దన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా నది

ప్రొసీడింగ్ పత్రాల అందజేత



ధన్వాడ: మండలంలో కొత్తగా 26 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో లబ్ధిదారులకు శనివారం ప్రొసీడింగ్ పత్రాలు మంజూరు చేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు పత్రాలు అందజేసి ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు చారి, ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ మాధవరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కోస్గి: ప్రతి మానవుడు జీవితంలో ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతత పొందవచ్చని కర్ణాటక మఠాధిపతి శ్రీశ్రీ గవిసిద్ది లింగేశ్వర శివాచార్య స్వామి అన్నారు. స్థానిక బసవేశ్వర మందిరం, మల్లికార్జున స్వామి ఆలయాలలో శ్రావణమాసం సందర్భంగా చేపట్టిన నందజ్యోతి కార్యక్రమ ముగింపు ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమంలో స్వామి మాట్లాడుతూ ప్రతిరోజు కొంత సమయాన్ని దైవ సేవకు కేటాయించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట: పట్టణంలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 వరకు విద్యుత్తు సరఫరా ఉండదని స్థానిక ఏఈ మహేష్ గౌడ్ తెలిపారు. చౌక్ బజార్, సరాఫ్ బజార్, దర్గా రోడ్డు మార్గంలో నూతన లైన్ ఏర్పాటు తోపాటు, దర్గా ప్రాంతంలో ఒకే చోటు ఉన్న మూడు విద్యుత్తు నియంత్రికలను మార్పుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్దూరు: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ఆదివారం ఉదయం 10.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని యాడ్‌లో మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలి

కోస్గి రూరల్: తాము సంపాదించిన దాంట్లో కొంతైన నిరుపేదల కోసం సేవా దృక్పథంతో ఖర్చు చేయాలని నారాయణపేట్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ హరినారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని నారాయణపేట్ జిల్లా, కోస్గి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రతాప్‌రెడ్డి , కోశాధికారి బెజ్జు వెంకట్రాములు , పూర్ణచంద్రయాదవ్ , చల్లా శ్రీరాములు, నాగులపల్లి నరేందర్ తదితరులు ఉన్నారు.